సాక్షి ఖమ్మం

బుధవారం । 14 । మే । 2025



పచ్చడికి ధరల సెగ

మామిడికాయలతో పాటు పచ్చడి తయారీలో ఉపయోగించే దినుసుల ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. 8లో



మెరుగైన బోధనే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధనే లక్ష్యంగా టీచర్లకు శిక్షణ ఏర్పాటు చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 28°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మరింత పెరిగి వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




అభివృద్ధి పనులపై ఆరాతీస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

వైరారూరల్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా అదనపు సిబ్బంది, యంత్రాలను సమకూర్చుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. వైరా మండలంలోని భట్టి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వైరా నదికి కరకట్ట, చెక్ డ్యామ్, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో చేపడుతున్న పనులను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, పమ్మి అశోక్, వడ్డె నారాయణరావు తదితరులున్నారు.

యంగ్ ఇండియా స్కూల్ స్థలానికి హద్దులు

బోనకల్: బోనకల్ మండలంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలకు సంబంధించి స్థలం ఖరారైంది. ఈమేరకు 25ఎకరాల స్థలాన్ని గుర్తించగా సర్వే అనంతరం మంగళవారం జిల్లా సర్వేయర్ వెంకటరావు హద్దులు నిర్ధారించారు. తహసీల్దార్ పూనం చందర్, సర్వేయర్ కృష్ణయ్యతో కలిసి హద్దు రాళ్లు పాతారు. అయితే, పాఠశాల అవసరాలకు మరో ఐదెకరాల భూమి కూడా సేకరించనున్నట్లు తహసీల్దార్ చందర్ తెలిపారు.



అగ్నిగుండంలా జిల్లా

రారెత్తిస్తున్న ఉష్ణోగ్రతలు ● ఉక్కపోతతో సతమతమవుతున్న జనం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండ తీవ్రత అగ్నిగుండాన్ని తలపిస్తోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా.. ఈ ఏడాది మంగళవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత నెల 26న గరిష్టంగా ముదిగొండ మండలం పమ్మిలో 43.1 డిగ్రీల ఉష్ణగ్రత నమోదు కాగా, మంగళవారం అదే మండలం బాణాపురం, పమ్మిలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. నేలకొండపల్లిలో 43.2, ఖమ్మం ఖానాపురం, ఎర్రుపాలెంలో 43, ముదిగొండ 42.9, రఘునాథపాలెం, చింతకాని 42.7, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్, గేటు కారేపల్లి, లింగాలలో 42.3, వైరా ఏఆర్ఎస్, ఖమ్మం ప్రకాష్‌నగర్, కొణిజర్లలో 42.2, పెనుబల్లి, కాకరవాయిలో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా ప్రాంతాల్లోనూ 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం విలవిల్లాడిపోయారు.

ఎండతీవ్రతతో సతమతం

ఎండ తీవ్రతతో జిల్లావాసులు సతమతమవుతున్నారు. పిల్లలు, వృద్ధులు నీరసిస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నం వేళకు మంటెత్తిస్తోంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అయితే, అర్ధరాత్రి 12 గంటల వరకు వేడి ప్రభావం కొనసాగుతుండడంతో ఏసీలు, కూలర్లు లేనిదే నిద్రపోని పరిస్థితులు ఎదురవుతున్నాయి.

పాలిసెట్‌కు 2,556 మంది హాజరు

ఖమ్మం సహకారనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మంలోని ఐదు కేంద్రాల్లో 2,804మంది విద్యార్థులకు 2,556 మంది హాజరయ్యారని పరీక్షల కోఆర్డినేటర్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. కాగా, పరీక్ష 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు జరగ్గా... విద్యార్థులను తనిఖీ చేస్తూ 9గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

ఎల్‌డబ్ల్యూఈ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

- ఉమ్మడి జిల్లాలో మూడు పార్కుల అభివృద్ధి
- అటవీ శాఖ అధికారులతో భేటీలో మంత్రి తుమ్మల



పీసీసీఎఫ్, అటవీ అభివృద్ధి శాఖ ఎండీతో చర్చిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి జిల్లాలోని అటవీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ సునీత, పీసీసీఎఫ్ సువర్ణతో హైదరాబాద్‌లో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఎల్‌డబ్ల్యూఈ నిధులతో అటవీ ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి అనుమతి జారీ చేయాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను కోరినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అడవులను సంరక్షిస్తూనే ఉమ్మడి జిల్లాలో ఆరు రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పడమటి నర్సాపురం - అన్నారుపాడు, పాత అంజనాపురం - బేతంపూడి, కొమ్ముగూడెం - రాఘవాపురం, హేమచంద్రాపురం - జూబ్లీపురం గుట్ట, వెంకటాతండా - కుంట్ల, కొత్తపల్లి - ఏపీ సరిహద్దు వరకు రహదారులు నిర్మించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే, ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్, సత్తుపల్లి, తల్లాడ మండలం కనిగిరి హిల్స్ ఎకో టూరిజం, కొత్తగూడెంలో ఎకోపార్క్ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఇవికాక ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ఆదాయం పెంచేలా ఉపాధి శిక్షణ ఇవ్వడంతో పరికరాలు సమకూర్చాలని, పోడు భూముల్లో వెదురు సాగుకు శ్రీకారం చుట్టాలని మంత్రి తెలిపారు. తద్వారా వారికి మెరుగైన ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.

పాస్‌బుక్ కలిగిన రైతులందరికీ రిజిస్ట్రేషన్

కొణిజర్ల: పట్టాదారు పాస్‌బుక్ కలిగిన ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తద్వారా కేంద్రప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. మండలంలోని తనికెళ్ల రైతు వేదికలో రైతుల రిజిస్ట్రేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన నంబర్ కలిగిన ఫోన్‌తో ఏఈఓలను సంప్రదించాలని తెలిపారు. కాగా, దుక్కులు దున్నడానికి ఇదే అనువైన సమయమని, తద్వారా వర్షాలు కురవగానే భూమి గుల్లబారి విత్తనాలు నాటొచ్చని వెల్లడించారు. వైరా ఏడీఏ టి కరుణశ్రీ, ఏఓ బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

ఆర్టీసీ ఈడీ సొలొమన్



ఖమ్మం బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఈడీ, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కరీంనగర్ జోన్ ఈడీ సాలొమన్ ఆదేశించారు. ఖమ్మంలోని రీజియన్ మేనేజర్ కార్యాలయం, పాత, కొత్త బస్టాండ్లను మంగళ వారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కార్గో పాయింట్, డిస్పెన్సరీలో పరిశీలించాక రీజినల్ మేనేజర్ సరిరామ్‌తో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. బస్సు సర్వీసుల నిర్వహ ణలో నిర్లక్ష్యం చేయొద్దని, ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా కొత్త రూట్లను గుర్తిం చాలని సూచించారు. ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, సూపర్‌వైజర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

▶ మధిర: ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఈడీ సాలొమాన్ సూచిం చారు. మధిర డిపోను తనిఖీ చేసిన ఆయన సర్వీసుల నిర్వహణ, తదితర అంశాలపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఖమ్మం ఆర్ ఎం సరిరామ్, మధిర డీఎం శంకర్‌రావు తదిత రులు పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ కొనసాగింపు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి(ఆన్ డ్యూటీ)గా విధుల్లో ఉన్న పి.ప్రవీణ్‌కుమార్‌కు మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభు త్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. పటాన్‌చెరువు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి అయిన ప్రవీణ్‌ను గత ఏడాది జనవరిలో ఖమ్మంకు కేటాయించారు. మరోమారు ఏడాది పొడించడంతో 2026 ఏప్రిల్ వరకు ఆయన ఇక్కడే విదులు నిర్వర్తించనున్నారు.

గ్రేడ్–2 కార్యదర్శులకు పదోన్నతులు

రాష్ట్రంలో నలుగురు కార్యదర్శులకు గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1గా పదోన్నతి కల్పించారు. ఇం దులో భాగంగా సత్తుపల్లి మార్కెట్‌లో పనిచే స్తున్న జి.సత్యనారాయణకు పదోన్నతి కల్పించి కల్లూరుకు, ఖమ్మం మార్కెట్ నుంచి వి.స్రుజన్ బాబుకు పదోన్నతి కల్పించి లక్సెట్‌పేట మార్కెట్‌కు బదిలీ చేశారు. అయితే, ఖమ్మం మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శిగా మాత్రం ఎవ రినీ నియమించలేదు.

క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌం డ్‌లో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారం భించారు. శిబిరాన్ని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకట్ ప్రారంభించి మాట్లా డుతూ ఔత్సాహికులకు మెరుగైన శిక్షణ ఇచ్చి హెచ్‌సీఏ టోర్నీలో ఆడేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ ఎం .డీ.మాసూద్‌తో పాటు ఫారూఖ్, తురాబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

హైడల్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఈ

కూసుమంచి: మండలంలోని పాలేరులో మినీ హైడల్ ప్రాజెక్టు(జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం)లో మరమ్మతు పనులను జెన్‌కో సీఈ(సివిల్) నారాయణ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా పురోగతిపై ఆరా తీసిన ఆయన, వర్షాకాలంలోగా పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే, గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలతో ప్రాజెక్టుకు నీరు సరఫరా చేసే కాల్వ కట్ట తెగిన నేపథ్యాన, అక్కడ చేపడుతున్న మరమ్మతులను కూడా సీఈ పరిశీలించారు. ఎస్ఈ దేశ్యా, డీఈ సింహాచలం పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

మధిర/చింతకాని: మధిర మండలం నిదానపు రానికి చెందిన కనపర్తి దానయ్య(49) వడదె బ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. ఎం డల కారణంగా అస్వస్థతకు గురైన ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. దానయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాగే, చింతకాని మండలం నాగు లవంచలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన గొడ్డుగొర్ల కేజీరాణి(55) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందింది. గత శనివారం పనికి వెళ్లిన ఆమె ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురికాగా ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగ ళవారం మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మామిడి పచ్చడికి ధరల సెగ

పచ్చడి పెట్టేందుకు జంకుతున్న సామాన్యులు

- తెగుళ్లు, అకాల వర్షాలతో దిగుబడి తగ్గి.. పెరిగిన కాయల ధరలు
- నూనె, కారం, ఇతర దినుసులదీ అదే పరిస్థితి



మామిడి ముక్కలు కొడుతున్న వ్యాపారి



పచ్చడి కలుపుతున్న మహిళ

మధిర: మాంసాహార ప్రియుల్లో సైతం కొందరు మామిడికాయ పచ్చడితోనే భోజనం ప్రారం భిస్తారు. ఇక శాకాహారులైతే తప్పక పచ్చడి ఉండా ల్సిందే. వీరే కాక సన్న, చిన్న కారు రైతులు, వ్యవ సాయ కూలీలు, ఇతర పనులకు ఉదయాన్నే వెళ్లే వారు, కూరలు వండలేని వారికి ఈ పచ్చడే కడుపు నింపుతుంది. దీంతో ఏటా మాదిరి ఈసారి కూడా పచ్చడి పెట్టడానికి సిద్ధమవుతున్న ప్రజలకు ధరలు బెంబేలెత్తిస్తున్నాయి.

ఆది నుంచి అవాంతరాలే...

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో మామిడి చెట్లకు పూత, పిందె సక్రమంగా రాలేదు. అంతేకాక వచ్చిన పూత కూడా చలికాలంలో మంచు కారణంగా తెగుళ్లతో రాలిపోయింది. ఆపై అరకొరగా మిగిలిన పూత పిందగా మారగానే ఇటీవల అకాల వర్షాలకు మరో దెబ్బపడినట్లయింది. ఇలా రకరకాల కారణాలతో ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో సీజన్‌లో రోడ్ల వెంట, మార్కెట్లలో విరివిగా లభించే పచ్చడి మామిడికాయలు ఈసారి పెద్దగా అందుబాటులోకి రాలేదు. ప్రధానంగా పచ్చడి తయారీకి ఉపయోగించే చిన్న రసాలు, పెద్ద రసాలు, నాటు, జలాలు, తెల్ల గులాబీ వంటి రకాల కొరతతో డిమాండ్ నెలకొంది.

పచ్చడి దినుసుల ధరలు

సామగ్రి	ధర (కేజీకి రూ.ల్లో)
కారం	300 - 600
ఎల్లిపాయలు	200
శనగ నూనె	170
ఆవాలు	170
మెంతులు	180
నువ్వుల నూనె	410

ఏపీ నుంచి తీసుకొచ్చి...

మార్కెట్‌లో చిన్న రసాలు రూ.30, తెల్ల గులాబీ, జలాలు వంటి రకాలు రూ.50 చొప్పు ధర పలుకుతున్నాయి. ఇక్కడ పెద్దగా దిగుబడి లేకపోవడంతో, జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, ఏ కొండూరు, నూజివీడు తదితర మండలాల నుంచి వ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గతంలో ఒక్కో చిన్న రసం చెట్టుకు సుమారు వెయ్యి మామిడికాయలు కాసేవని.. ఈసారి తెగుళ్లు, అకాల వర్షాలతో ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇక కొన్ని మామిడికాయలకు మంగు రావడంతో పచ్చడి తయారీకి పనికి రావని కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా మిగిలిన కాయలకు డిమాండ్‌తో పాటు ధర పెరుగుతోంది.

అదే బాటలో దినుసులు

ఏడాది పాటు మామిడి పచ్చడి నిల్వ ఉండాలంటే నాణ్యమైన కాయలు ఎంచుకోవడమే కాక మేలు రకం దినుసులు ఎంచుకుంటారు. అయితే, ఈసారి సామగ్రి ధరలు కూడా మండిపోతున్నాయి. దీంతో పచ్చడి పెట్టకముందే మంట పుడుతుందని సామాన్యులు వాపోతున్నారు. చట్నీ పెట్టేందుకు కావాల్సిన నూనె, కారం, ఉప్పు, ఎల్లిపాయలు, ఆవాలు, మెంతుల ధరలు పెరిగాయి. పలు రకాల మిర్చి ధర తక్కువగా ఉన్నా పచ్చడి పెట్టే లావు రకాల మిర్చి ఎక్కువగానే ఉంది. ఈ మిర్చి కేజీ రూ.300 నుంచి రూ.600 వరకు పలుకుతుండగా.. కారం పట్టించడానికి కేజీకి రూ.40 వెచ్చించాల్సి వస్తోంది.

మహిళలు బిజీబిజీ..

ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బంధువులు, మిత్రులు ఒక చోటకు చేరి జాడీల కొద్ది పచ్చడి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇంకొందరు తమ బంధువులు, స్నేహితులు, ఇతర ప్రాంతాల్లో ఉండే పిల్లలకు పంపించేందుకు మామిడికాయ పచ్చడి తయారుచేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా కారం మిల్లుల్లో రద్దీ ఉంటుండగా, పచ్చడి తయారీతో పలువురి ఇళ్లు కళకళలాడుతున్నాయి.

అయినా తప్పడం లేదు..



ఏటా పచ్చడి పెట్టడం తప్పనిసరి. కూర చేయలేని రోజు, కూరగాయల ధరలు పెరిగినప్పుడు పచ్చడి తీసుకుని కూలీ పనులకు వెళ్తాం. ఈసారి పచ్చడికి ఉపయోగించే వస్తువుల ధరలు పెరిగినా తప్పడం లేదు. – కృష్ణవేణి, కూలీ, మధిర

పిల్లలకు పంపించేందుకు...



అమెరికా, హైదరాబాద్, ఖమ్మంలో ఉంటున్న పిల్లలకు ఏటా పచ్చడి పంపిస్తాం. కూరగాయలతో తినలేనప్పుడు పచ్చడి ఉయోగపడుతుంది. అందుకే ఏటా అందరికీ కలిపి మామిడికాయ పచ్చడి పెడతాం. – రమావత్ మారోనిబాయి, మధిర

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

'హార్వెస్' విద్యార్థుల విజయకేతనం



పది, 12వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) పదో తరగతి, 12వ తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 250మంది హాజరుకాగా 100శాతం ఉత్తీర్ణత నమోదైందని వెల్లడించారు. ఇందులో 500మార్కులకు కె.రిషిత్ 492మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఎస్.తేజస్వి 489, బి.హిమ వర్షిణి 487, ఎం.ధన్విత 485, బి.చందనప్రియ 483, ఎస్.కే.షాజియా ఇరం 483, పి.ధీరజ్ 481, బి.సహస్ర, పి.భువన్ 480మార్కులు సాధించారని తెలిపారు. అలాగే, 12వ తరగతి ఫలితాల్లో 500కు ఎస్.రాఘవేంద్ర నవనీత్ 487 మార్కులతో అగ్రస్థానాన నిలిచాడని కరస్పాండెంట్, పార్వతిరెడ్డి తెలిపారు. అంతేకాక రేపల్లి శ్రీష 484, బి.సాయిచరణ్ 482, ఎం.నాగయశ్వంత్ 482, బి.సిద్ధార్థ్ 482, ఎన్.సీ.హెచ్.జస్వంత్ సాయి 478, బి.సంజయ్ 477, జి.రాణి ఉమాఅలేఖ్య 475, డి.శ్రీనివాస గౌతమ్‌రెడ్డి 472, కె.రోహిత 471, టీ.డీ.వీ.ఎస్.ఎస్.నైమాంజలి 470, బి.భార్గవి 470మార్కులు సాధించారన్నారు. కాగా, 12వ తరగతి పరీక్షకు 185 మంది హాజరవగా 100శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీచైతన్య ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రభంజనం సృష్టించారని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఖమ్మం మమత రోడ్డులోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించగా వారిని అభినందించి మాట్లాడారు. కాసిన జస్వంత్ 500 మార్కులకు 489 మార్కులు, కవితాచౌదరి 485, యశస్విత 484, సూర్యతేజ 483, సంహితరెడ్డి 480 మార్కులు సాధించగా, వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏజీఎం చేతన్‌మాథూర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాళ్లు నాగప్రవీణ, టీ.ఎల్.ఎన్.శర్మ, సురేష్, డీన్ లక్ష్మీ నర్సింహ, ఇన్‌చార్జ్‌లు రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

15 నుంచి 26 వరకు సర్వీసులు

ఖమ్మంమయూరిసెంటర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం ఉమ్మడి జిల్లా నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపించనున్నట్లు ఆర్‌సీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ తెలిపారు. తొలుత ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతామని వెల్లడించారు. ఖమ్మం నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే సర్వీస్ మధ్యాహ్నం 12 గంటలకు కాళేశ్వరం చేరుకోనుండగా, తిరిగి సాయంత్రం 4 గంటలకు అక్కడి నుంచి బయలుదేరుతుందని తెలిపారు. ఇందులో పెద్దలకు రూ.480, పిల్లలకు రూ.260 చార్జీ ఉంటుందని పేర్కొన్నారు. కొత్తగూడెం నుంచి ఉదయం 6 గంటలకు, కాళేశ్వరం నుంచి సాయంత్రం 4.30 గంటలకు బస్సు బయలుదేరుతుందని, ఇందులో పెద్దలకు రూ.580, పిల్లలకు రూ.300 చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, మణుగూరులో ఉదయం 6 గంటలకు, తిరిగి కాళేశ్వరం నుంచి 3–30 గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. కాగా, కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లాలనుకునే భక్తులు డిపోల్లో సంప్రదిస్తే బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్ఎం తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన బోధనే లక్ష్యం



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి
- ఉపాధ్యాయుల శిక్షణలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఉపాధ్యాయులకు మూడు విడతలుగా ఇవ్వనున్న శిక్షణ మంగళవారం ఖమ్మంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల పిల్లలే ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నందున వారిని ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. తాను ఏడో తరగతి చదువుతున్నప్పుడు ఉపాధ్యాయులు విజయలక్ష్మి తీసుకున్న శ్రద్ధతో ఈ స్థాయికి ఎదిగానని గుర్తు చేసుకున్నారు. అలాగే, భవిత సెంటర్లలో అవసరమైన పరికరాలు సమకూరుస్తూ, దివ్యాంగ విద్యార్థులకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డీఈఓ ఎస్.సత్యనారాయణ, సీఎంఓ రాజశేఖర్, ఏఎంఓ రవికుమార్, ఎంఐఎస్ రామకృష్ణ, హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి పాల్గొన్నారు.

జూలై 15 తర్వాత పాడి పశువుల కొనుగోలు

ఇందిరా మహిళా డెయిరీ పథకం ద్వారా జూలై 15 తర్వాత లబ్ధిదారులకు పాడి పశువులు కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. డెయిరీ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జూలై 15నుంచి జనవరి వరకు 5వేల పాడి పశువుల యూనిట్లు గ్రౌండింగ్ చేయాలన్నారు. ఈ క్రమంలో పశువుల ఆరోగ్యం, ఇతర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డీఆర్డీఓ సన్యాసయ్య, బీసీ, ఎస్సీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు జి.జ్యోతి, నవీన్‌బాబు, డాక్టర్ పురంధర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా మార్ట్ నిర్వహణపై శిక్షణ

▶ ఖమ్మంమయూరిసెంటర్: మహిళా మార్ట్‌ను లాభాల బాటలో నడిపేలా మహిళా సంఘాల సభ్యులకు ఇప్పటికే శిక్షణ ఇప్పించామని కలెక్టర్ ముజమ్మిల్ తెలిపారు. ఖమ్మం సీక్వెల్ రోడ్డులో సిద్ధమవుతున్న మార్ట్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడారు. సామగ్రి నిర్వహణ, భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీఆర్డీఓ ఆర్.సన్యాసయ్య, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిర: మండలంలోని వంగవీడు సమీపంలో చెరువు వద్ద పేకాట ఆడుతున్న వారిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై లక్ష్మీభార్గవి, సిబ్బంది తనిఖీ చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి ద్విచక్ర వాహనం, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెడ్లు మృతి

కారేపల్లి: విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతంతో రెండు దుక్కిటెడ్లు మృతి చెందాయి. కారేపల్లి మండలం నానునగర్‌తండా వాసులు బర్మావత్ శంకర్, వాంకుడోతు చిన్నాకు చెందిన ఎద్దు, ఆవులు మంగళవారం ఉదయం మేతకు వెళ్లాయి. రెండు రోజుల క్రితం గాలిదుమారానికి స్తంభంపై ఇన్సులేటర్ పగిలి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వీటిని సరిచేయకోవడంతో మేతకు వెళ్లిన ఎద్దు, ఆవు తీగలను తాకగా షాక్ గురై మృతి చెందాయి. రూ.లక్షల మేర నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

▶ కామేపల్లి: కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన బోడా శంకర్ రోజులాగే ఆవులు, దూడలను మేతకు వదిలాడు. సమీప పొలంలో తెగిపడిన 11 కేవీ విద్యుత్ వైరును తాకడంతో కోడెదూడ షాక్ గురై మృతి చెందింది.

పరారీలో నకిలీ ఏటీఎం కార్డుల ముఠా

కొత్తగూడెంఅర్బన్: నకిలీ (క్లోనింగ్) ఏటీఎం కార్డులతో ఖాతాదారులను మోసగిస్తున్న ముఠా విషయమై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ సూచించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హరిదాస్ బిశ్వాస్, దిజన్ మంజుదార్, సోనాల్ నరేంద్ర విఖార్, అషిత్ దత్తా ముఠాగా ఏర్పడి నకిలీ ఏటీఎం కార్డులు రూపొందిస్తున్నారని, ఆపై బ్యాంకర్ల పేరిట ఖాతాదారులకు ఫోన్ చేసి డబ్బులు డ్రా చేస్తున్నారని వెల్లడించారు. వీరిపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, రిమాండ్ ఖైదీలుగా ఉంటూ బెయిల్‌పై బయటకు వచ్చాక విచారణకు హాజరుకావడం లేదని తెలిపారు. ఈ నేపథ్యాన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఏటీఎంల వద్ద అనుమానితులు కనిపించినా, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చినా 87126 82017 నంబర్‌లో సంప్రదించాలని సీఐ ఓ ప్రకటనలో కోరారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

తల్లాడ: రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో మంగళవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించాక ఎంపీడీఓ కార్యాలయంలో మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 351 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో హనుమకొండకు జిల్లాకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించగా, ఆ జిల్లాకు ఇంకా 30వేల మెట్రిక్ టన్నులతో పాటు వరంగల్‌కు 20 వేల మెట్రిక్ టన్నులు తరలిస్తామని చెప్పారు. అయితే, కొనుగోలు కేంద్రాల్లో కాంటా కాగానే మిల్లులకు తరలించేలా లారీలు సమకూరుస్తున్నందున వేగం పెంచాలని సూచించారు. కాగా, కుర్నవల్లిలో 1638 రకం ధాన్యం 30 వేల బస్తాలు ఉన్నందున మిల్లు యజమానులు దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఎవరైనా తేమ, తాలు పేరుతో తరుగు తీస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షానికి ధాన్యం తడవకుండా 13 వేల టార్పాలిన్లు సరఫరా చేశామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ చందన్‌కుమార్, డీఎం గంటా శ్రీలత, ఆర్డీఓ రాజేందర్ గౌడ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐలు కిరణ్, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

■ నమూనా.. అదరహో!



ముదిగొండలోని మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల ఆవరణలో నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయింది. లబ్ధిదారులు, మేస్త్రీలకు అవగాహన కల్పించేలా నిర్మించిన ఈ ఇంటిని రంగులతో తీర్చిదిద్దగా కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చిన వరకు వారు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఇదే సమయాన అర్హులైన పేదలు తమకు ఇళ్లు ఎప్పుడు మంజూరవుతాయోనని చర్చించుకుంటున్నారు. – ముదిగొండ

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

- 36 తులాల బంగారంతో పాటు వెండి, నగదు అపహరణ
- రెక్కీ చేసి మరీ చోరీకి పాల్పడిన నిందితులు?



ఉపాధ్యాయుడి ఇంట్లోకి ప్రవేశిస్తున్న దుండగుడు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఆరో డివిజన్‌లోని న్యూ ఖానాపురంలో భారీ చోరీ కలకలం రేపింది. తిరుమలలో దైవదర్శనానికి వెళ్లిన ఉపాధ్యాయుడి ఇంటిని లక్ష్యంగా ఎంచుకున్న దుండగులు చోరీకి పాల్పడ్డారు. కామేపల్లి మండలం పాతలింగాల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బానోతు శోభన్ – వనిత దంపతులు న్యూఖానాపురంలో నివసిస్తుండగా కుటుంబంతో కలిసి సోమవారం రాత్రి రైలులో తిరుపతి బయలుదేరారు. ఇదే సమయాన స్కూటీపై వచ్చిన దుండగులు, ఎవరూ లేరని నిర్ధారించుకున్నట్టు తెలిసింది. ఆపై రెండు గడ్డపారలతో తాళం పగలగొట్టి లోనకు ప్రవేశించారు. అనంతరం బీరువా, లాకర్లను బద్దలుకొట్టి అందులో దాచిన 36 తులాల బంగారం, 30తులాల వెండి ఆభరణాలు, రూ.12వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయం మంగళవారం ఉదయం బయటపడడంతో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ క్లూస్‌టీమ్‌తో చేరుకుని ఆధారాలు సేకరించారు.

45నిమిషాల పాటు ఇంట్లోనే..

మంగళవారం తెల్లవారుజామున 3గంటల సమయాన ముసుగులు ధరించిన దుండగులు ఉపాధ్యాయుడు శోభన్ ఇంట్లోకి ప్రవేశించి సుమారు 45నిమిషాల పాటు ఉన్నారు.. వీరి కదలికలన్నీ సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కాగా, చోరీ తర్వాత బయటకు వస్తుండగా, అప్పుడే వాకింగ్‌కు వెళ్తున్న స్థానికుడైన కృష్ణారావుకు అనుమానం వచ్చి శోభన్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో ఆయన తమ బంధువులను పంపించగా చోరీ విషయం బయటపడింది. కాగా, శోభన్ ఇంట్లోనే కాక అదే భవనంలో కింద అద్దెకు ఉండే వారి ఇంటి కూడా తాళం పగలగొట్టినట్లు సీసీ కెమెరాల పుటేజీ ద్వారా గుర్తించారు. ఈమేరకు తిరుమల ప్రయాణం రద్దు చేసుకున్న ఉపాధ్యాయ దంపతులు ఖమ్మం చేరుకుని పోలీసులను ఆశ్రయించారు. కాగా, ఖమ్మం స్టేషన్‌కు వెళ్లే సమయంలో ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా ఆటో బుక్ చేసుకోగా, ఆటో డ్రైవర్‌పైనా అనుమానంతో పోలీసులు ఆరా తీస్తున్నారు.